# విలువ

"ఓ వంద సర్దండి - ఫస్టు కిస్తాను." మూర్తి అడిగాడు ప్రకాశాన్ని.

ప్రకాశం అతని వంక సూటిగా చూశాడు. అవమాన భారంతో మూర్తి తల కిందకు దిగిపోయింది.

"తీసుకో!" పర్సు తీసి ఉన్న నోట్లోంచి ఓ నోటు లాగి నిర్లక్ష్యంగా ఇచ్చాడు ప్రకాశం.

"థాంక్యూ గురూ! సమయానికి ఆదుకున్నావు."

తల పంకించాడు ప్రకాశం.

మూర్తి తేలికైన మనసుతో ఆఫీసు నుంచి బయట కొచ్చాడు. ఏమిటో ఈమధ్య ఆర్థికంగా ఇబ్బందులు వచ్చి పడుతున్నాయి. ఎంత పొదుపుగా వాడుకున్నా జీతం చాలడం లేదు. ఒక ఖర్చు మిగిలిందిలే అని సంతోషపడేలోపే దానికి రెట్టింపు ఖర్చు తగులుతున్నది.

ఓ నెల చుట్టాలొస్తే బట్టలు పెట్టాల్సి వచ్చింది. ఇంకో నెల మామగారింటికి వెళ్ళాల్సొచ్చింది. మరో నెల పరీక్ష ఫీజు కట్టాల్సొచ్చింది. ఇలా ఏ నెల కా నెల ఏదో ఖర్చు తోసుకొస్తున్నది.

అయినా తను ఉద్యోగస్తురాల్ని చేసుకుంటే బాగుండేది. మొదటినుంచీ తన ఆశయం కూడా అదే! ఏదో వేణ్ణీళ్ళకు చన్నీళ్ళులాగా భార్య భర్తలిద్దరూ సంపాదిస్తేనే ఈ గడ్డు కాలంలో సంసారం బండి నడపగలరు. కనీసం ఓ అయిదు వందలో లేక పది వందలో సంపాదించగల నేర్పు శోభకు ఉంటే బాగుండేది. పూర్తిగా తెలివితక్కువది. ఏ ఉద్యోగం రాదు - ఏదీ చెయ్యలేదు. ఆర్థికంగా తనను చిక్కులపాలు చేసింది. అయినా తను చేసుకోకుండా ఉండాల్సింది. అమ్మా నాన్న బలవంతం చేశారని - కొంచెం అందంగా ఉందని తను పట్టు సడలించాడు. అంతే! ఇలా ఊబిలో ఉన్నాడు! ఆలోచనలతోనే ఇల్లు చేరాడు.

"అబ్బ, వచ్చారా! గంట నుంచి మీకోసం ఎదురుచూస్తున్నాను." నవ్వుతూ ఎదురొచ్చి చెప్పింది శోభ .

"ఏం? ఎందుకు ఎదురుచూడ్డం? ఆఫీసు వదిలిన వాడిని ఇంటికి రానా?" విసుక్కున్నాడు. శోభ చిన్నబుచ్చుకుంది. "అది కాదండి - రోజూకంటే పెందరాళే వస్తానని చెప్పి, రోజూ కంటే ఆలస్యంగా వస్తే..." అతను కుర్చీలో కూర్చోగానే బూటు విప్పుతూ చెప్పింది.

"ఆఁ!మరి డబ్బులు దొరకాలిగా - ఒంటి సంపాదన - ఎంతకాలం వస్తుంది? ఎప్పుడో అయిపోయింది. అప్పు దొరికేటప్పటికి ఆలస్యం అయింది." కారణం చెబుతూనే అతను ఆమెను తీక్షణంగా చూశాడు. ఆ చూపును అర్థం చేసుకోలేనంత తెలివితక్కువది కాదు ఆమె. 'తేరగా తింటున్నావు- నేను కష్టపడి సంపాదించి తెస్తున్నాను. నువ్వు దుబారా చేస్తున్నావు. నీకు సంపాదించడం రాదు. నాకర్మ కొద్ది నిన్ను కట్టుకున్నాను. అందుకే జీతం చాలడం లేదు' అని.

"అయ్యో!పొద్దునే చెప్పి ఉంటే మనం పార్టీకి వెళ్ళడం వద్దనుకునేవాళ్ళంగా!" నొచ్చుకుంది.

"సరేలే! ఇవ్వాళ ఈ ఫంక్షన్‌కు పోకపోతే మన కష్టాలు తీరతాయా? ప్రతి నెలా ఉన్న భాగోతమేగా! ఈ పార్టీ కాకపోతే ఇంకో ఖర్చు - మామూలే"! స్నానానికి లేస్తూ అన్నాడు.

"వేణ్ణీళ్ళు పెట్టి చాలాసేపయింది - చల్లారిపోయి ఉంటాయి - ఓ అయిదు నిమిషాలు

కూర్చుంటే మళ్ళీ కాగబెడతాను. ఈ లోపు కాసిని కాఫీ తాగండి." చెప్పింది.

"అక్కర్లేదు. అవమానాగ్ని చల్లారాలంటే చన్నీళ్ళు చాలు!" అంటూ విసురుగా తువ్వాలు భుజంమీద వేసుకుని బాత్‌రూముకు వెళ్ళిపోయాడు మూర్తి. శోభకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. రోజు రోజుకూ ఎంప్లాయడ్ వైఫ్ కావాలనుకున్నతను తనను ఎందుకు ఒప్పుకోవాలి? తానేమి కాళ్ళా వేళ్ళా పడలేదు. వాళ్ళ తల్లిదండ్రులు అడిగారు. తన వాళ్ళు చూపించారు. ఇష్టపడి పెళ్ళి చేసుకున్నారు. పెళ్ళికి ముందే తెలుసుగా తన క్వాలిఫికేషన్లకు ఏ ఉద్యోగం రాదని. అయినా చేసుకుని ఇప్పుడు తనకు ఉద్యోగం లేదని సాధిస్తే తనేమైపోవాలి? శోభ అలా ఆలోచనల్లో పడిపోయి మూర్తి వచ్చి డ్రెస్ చేసుకోవడం కూడా గమనించలేదు.

"ఏయ్ మొద్దు! ఇంకా అలా కూర్చోనే ఉన్నావా? టైమయిపోతున్నది, డ్రెస్ చేసుకో. ఊఁ! కాఫీ ఇలా తగలెయ్యి." విసుక్కుంటూ అన్నాడు.

"కాఫీ తెస్తున్నా!" ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చి హడావిడిగా కాఫీ తెచ్చి ఇచ్చింది. సంతృప్తిగా అతను కాఫీ చప్పరిస్తున్నాడు.

"ఏమండీ! మనం పార్టీకి వెళ్ళాలా?" నసిగింది.

"ఏం? ఎందు కొచ్చింది సందేహం?"

"ఏం లేదు. అసలే డబ్బు ల్లేవంటున్నారు. మళ్ళీ రిక్షాల ఖర్చు. పైగా ప్రెజంటేషన్ ఖర్చు. మనం పోకపోతే ఇదంతా మిగులుతుంది."

"చాల్లే తెలివి! స్వరూప్ మనల్నే పిల్చింది. పైగా నాకు బాగా క్లోజ్! ప్రమోషన్ వచ్చింది కదాని మనకు డిన్నర్ ఇస్తున్నాడు. ముందు ముందు అతనితో మనకు చాలా అవసరాలుంటాయి – ఒకే డిపార్ట్‌మెంట్ మనిషి! ఇప్పుడు మనల్ను అపార్థం చేసుకుంటాడు. నా ఫ్యూచర్ దెబ్బతింటుంది. అయినా తెలియనిదానివి తెలియనట్లు ఉండక వెధవ సలహా లెందుకుఇస్తావు?" కోపంగా అన్నాడు మూర్తి గుడ్లుఉరుముతూ. "తొందరగా తగలడు, అతను పంక్చువాలిటీకి ప్రాణం ఇస్తాడు."

"మీరు పోదామంటే నేనెవర్ని అడ్డు చెప్పడానికి." గబగబా డ్రెస్ చేసుకోసాగింది. స్వరూప్ భార్య రూప కూడా ఉద్యోగస్తురాలే! స్కూల్లో టీచర్‌గా పని చేస్తుంది. ఇద్దరు పిల్లలు కూడా. ఇద్దరూ సంపాదిస్తున్నారు. బోల్డంత మిగుల్చుకోవచ్చు. వాళ్ళ జీవితం ఆనందమయం! పట్టుపట్టి ఉద్యోగస్తురాల్ని పెళ్ళి చేసుకున్నాడు. డబుల్ ఇన్‌కమ్. ఇంకేం? వాళ్ళిల్లు స్వర్గం.

మూర్తి శోభ రిక్షాలో అయిదు కిలోమీటర్లు దాటి ఊరికి దూరంగా ఉన్న స్వరూప్ ఇంటికి చేరేసరికి చీకటి పడింది. రిక్షా దిగి, డబ్బులు చెల్లించాడు. ఇంట్లో పిల్లలుగోల బయటికి వినిపిస్తున్నది. స్వరూప్, అప్పుడు ఒకటి తగలనిచ్చినట్టున్నాడు – చంటిది ఆరు నొక్క రాగం ఆలపిస్తున్నది.

"స్వరూప్ నే రావచ్చా?" కాలింగ్ బెల్ నొక్కుతూ అరిచాడు మూర్తి లోపలికి తొంగిచూస్తూ.

"హల్లో మూర్తి! కమాన్ కమాన్! కమాన్ సిస్టర్!" స్వరూప్ లోపలినుంచి పరుగెత్తుకుంటూ బయటకు వచ్చాడు చేతిలో అట్లకాడతో. మూర్తి శోభలు లోపలికి వచ్చి హాల్లో కూర్చున్నారు. నానీ చిట్టి తెగ అల్లరి చేస్తున్నారు. "ఆంటీ ఆంటీ" అంటూ శోభ మీదకు ఎగబడ్డారు స్వరూప్ ఎంత వారిస్తున్నా వినకుండా.

"సారీ! అల్లరి ఎక్కువైంది వెధవలకు."

"పిల్లలు అల్లరి చేస్తేనే అందం అన్నయ్యగారూ!" చిట్టిని శోభ ఎత్తుకుంటూ అంది.

"రూపగారు లేరా? "మూర్తి అడిగాడు. "లేటుగా వస్తుందిట." చెప్పాడు. ఇంతలో లోపలనుంచి ఏదో మాడిన వాసన వస్తే కంగారుపడి లోపలికి పరుగెత్తాడు.

"ఆంటీ! ఇవ్వాళ ఆయా రాలేదు." నానీ చెప్పాడు.

"అంకుల్! సర్వెంట్ మెయిడ్ రాలేదు. నాన్నే అంట్లు తోమారు." చిట్టి చెప్పింది ముద్దు ముద్దుగా.

మూర్తికి కొంచెం అనీజీగా ఉంది. అనవసరంగా తాము భోజనానికి వచ్చామా అని ఫీలయ్యాడు.

"హల్లో మూర్తీ! ఓ ఫైవ్ మినిట్స్. వంట అయిపోతుంది. ఈలోగా తనూ వస్తుంది." స్వరూప్ బయటకొచ్చి అపాలజిటిక్‌గా చెప్పాడు.

"స్వరూప్! శోభ వచ్చి వంట చేస్తుంది. మీరిలా వచ్చెయ్యండి." మూర్తి అన్నాడు అతని అవస్థకు జాలిపడుతూ.

"అవును అన్నయ్యగారూ! మీరు చెయ్యి కాల్చుకోవడ మేమిటి నేను ఉండగా." చొరవగా లోపలికి పోబోయింది.

"సారీ! మీరు గెస్టులు! మీతో చేయిస్తానా? అసలు ఈ వంటమనిషి ఇవ్వాళ ఎగ్గొట్టకపోయినా సమస్య ఉండేది కాదు. కనీసం పనిమనిషి వచ్చినా బాగుండేది – పోనీ ఆయా అన్నా పిల్లలకు సాయంగా ఉంటే ఓ మాదిరిగా ఉండేది. ఆఖరికి రూప ముందుగా వచ్చినా ఈపాటికి వంట అయిపోయేది. అన్నీ నేనే చేసుకునేసరికి లేటైపోయింది." స్వరూప్ అన్నాడు.

"అంటే... మీ కింత తీరిక ఎలా దొరికింది?"

"సింపుల్! సెలవు పెట్టాను."

"అదేంటి. రూపతో, పెట్టించకపోయారా?"

"అఫ్ కోర్స్! కాని ఆమెకు మనలాగా ఫ్రీడం ఉండదుగా – అందుకని నేనే పెట్టాను. మరేం చేస్తాం? ఎవరు లేంది చిన్న పిల్లలతో కష్టం!" స్వరూప్ చెప్పి లోపలికి వెళ్ళిపోయాడు వంట చెయ్యడానికి.

కాసేపటికి హ్యాండ్ బాగ్ ఊపుకుంటూ రూప వచ్చింది. "హల్లో శోభా! ఎప్పుడు రావడం?"

"ఓ అరగంటయింది. మీవారు మీకోసం ఎదురుచూస్తునారు." శోభ చెప్పింది గిల్టీగా.

"తప్పదు. ఇద్దరూ ఉద్యోగాలు చేయాలంటే అప్పుడప్పుడు ఇబ్బందులు భరించక తప్పదు."

ఓ గంట తరువాత కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు ముగించారు. మూర్తి, శోభలకైతే ముళ్ళమీద కూర్చున్నట్లుంది. ఎందుకు భోజనాని కొచ్చి వాళ్ళని ఇబ్బందులపాలు చేశామని తెగ మథనపడ్డారు తమ మనసుల్లో.

"నీకు ప్రమోషన్ వచ్చిన శుభ సందర్భంలో చిన్న కానుక!" ప్రజెంటేషన్ తీసి ఇచ్చాడు మూర్తి . రాధా కృష్ణుల విగ్రహం!

"చాలా బాగుంది." రూప మెచ్చుకుంది. ఇల్లు చూపిస్తానని రూప మూర్తిని లేపింది – పిల్లలు పాలు అని వెంబండించారు. కొంచెం ఏకాంతం దొరకగానే శోభ అడిగింది స్వరూప్‌ను.

"అన్నయ్యగారూ! నాకూ ఓ చిన్న ఉద్యోగం ఇప్పించండి. కనీసం ఓ అయిదు వందలు వచ్చినా చాలు." జాలిగా అడిగింది.

"ఉద్యోగమా? నీకెందు కమ్మా?"

"ఊరికే కూర్చుని తినలేకపోతున్నాను. కొంచెం టైం పాస్!" తల వంచుకొని చెప్పింది.

"ఇది నీకు పుట్టిన బుద్ధా? వాడికి పుట్టిందా?" సూటిగా అడిగాడు స్వరూప్ గంభీరంగా. ఇంతలో మూర్తి వచ్చాడు రూపతో.

"ఏరా మూర్తి! శోభకు ఉద్యోగం కావాలా?"

"ఉంటే చూడు గురూ! బొత్తిగా డబ్బులకు ఇబ్బందిగా ఉంది. ఊరికే కూర్చుని ఏం చేస్తుంది? కాస్త ఉద్యోగం చేసి సంపాదించి భర్తకు తోడ్పడవచ్చుగా."

స్వరూప్ సీరియస్‌గా అయిపోయాడు ఉన్నట్టుండి.

"మే మిద్దరం సంపాదిస్తున్నామన్నదే బయటివాళ్ళకి కనిపించేది. కాని ఏభై రూపాయిలిచ్చి అంట్లు, కసువులాంటి పన్లకు పనిమనిషిని పెట్టుకున్నాను. ఇద్దరం ఉద్యోగాలకు వెళతాం కాబట్టి పిల్లని ఆడించడానికి ఆయాను పెట్టాను. భోజనం, కాఫీ, టిఫిన్లు కాక – రెండొందలు నెలకు ఆమె జీతం. పొద్దున్నే హడావిడికి వంట గింట కావడంలేదని నూట ఏభై ఇచ్చి వంటమనిషిని పెట్టుకున్నాను. కాని ఎంతమందిని పెట్టినా సుఖం లేదు. భయపడుతూ బ్రతకాలి. తీసుకునేది తీసుకుంటూ పనులు మానేస్తామని బెదిరిస్తూ ఉంటారు. అంతేకాదు, పిల్లల్ని సరిగా చూస్తుందా ఆయా? వీళ్ళకు పెట్టమని పెట్టిన టిఫిన్లు కూడా తాను తింటుంది. పిల్లలకు ఆలనా పాలనా లేదు. రేపు పెద్దయితే వాళ్ళకు మళ్ళీ ట్యూషన్ పెట్టించాలి." స్వరూప్ చెప్పాడు.

"పని మనుషులన్న తరువాత సొంత మనుషుల్లా ఎలా చూసుకుంటారు. వాళ్ళకు మనం భయపడే రోజు లొచ్చాయి. వాళ్ళు చేసినట్లు చేయించుకోవానోరు మూసుకుని." రూప చెప్పింది – భర్త చెప్పింది విన్న తరువాత. చీకటి పడిందని సెలవు పుచ్చుకున్నారు మూర్తి, శోభ. రిక్షా దొరికేదాకా వస్తానని చెప్పి స్వరూప్ వీళ్ళ వెంట బయటకు వచ్చాడు.

"స్వరూప్! పెళ్ళాం సంపాదిస్తూ ఉంటే మనం ఎంతమందినైనా పెట్టుకోవచ్చు. ఎంత జీతాలైనా ఇవ్వచ్చు." మూర్తి నిష్ఠూరంగా అన్నాడు.

"ఇవాళ చూశావుగా నన్ను? సెలవు పెట్టాల్సి వచ్చింది. అయినా ఏదో ఆమె సంపాదిస్తుంది అనుకుంటాం గాని, ఆమె సంపాదన ఆమె ఖర్చులకే సరిపోతుంది. బయట తిరగాలి కాబట్టి – చీరలు, చిల్లరమల్లర ఖర్చులు ! డబ్బు పోతే పోయింది. సుఖం లేదురా! ఏదో సంపాదిస్తున్నాం. యాంత్రికంగా బ్రతికేస్తున్నాం. అంతే ! ఆప్యాయత, అనురాగం, మమత, మమకారం కరువవుతాయి. అన్నీ వేళకు జరిగిపోవాలి." స్వరూప్ ఆవేదనగా అన్నాడు. "మెకానికల్? అదొక జీవితం, సారం లేని జీవితం!"

"ఆ! నాకూ నీలాగే సంపాదించే భార్య ఉంటే ఇలాగే కథలు చెప్పేవాడిని!" మొరటుగా ఖండించాడు మూర్తి.

"మూర్తి ! భార్య చేసే సేవల ముందు ఏ సంపాదనా పనికిరాదు. పనిమనిషి ఖర్చు నీకు మిగిలింది. ఆయా ఖర్చు లేదు. వంట మనిషి జీతం మిగిలింది. పైగా ఇంటికి రాగానే ఆప్యాయత కురిపించే ఇల్లాలి ప్రేమ! పిల్లలు పెరిగేకొద్దీ – వాళ్ళను ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దే గురువు! స్వర్గం! టెన్షన్ లేని స్వర్గం!", స్వరూప్ సాలోచనగా అన్నాడు అతని మాటల్లో ఏదో పోగొట్టుకున్న ఆవేదన కనిపించింది.

"అలా చెప్పండి అన్నయ్యగ్గారూ!", శోభ చెప్పింది.

"మూర్తి! భార్య సేవల్ని రూపాయలలో విలువ కట్టగలిగితే, ప్రతి భర్తా ఆమెకు ఋణపడే ఉంటాడు. నువ్వు సంపాదించే జీతం ఆ విలువ ముందు గడ్డిపోచ! నువ్వు సంపాదిస్తుంటే నీ భార్య ఊరికే తిని కూర్చుంటున్నదనే నీ అభిప్రాయం అతి హీనం! దారుణం. భార్య సేవలకు ఖరీదు కట్టే షరాబు పుట్టేదాకా నీలాంటి వెధవలకు జ్ఞానం కలగదు." తిరస్కారంగా అన్నాడు.

రిక్షా దొరికింది, మూర్తి శోభ ఎక్కారు – 'బై' చెప్పి కదిలారు. మూర్తి శోభ చేతిని ఆప్యాయంగా నొక్కాడు.

(ఆంధ్రప్రభ వారపత్రిక)

